

బైక్..భద్రం!
వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలని, వర్షం కురుస్తున్నప్పుడు ప్రయాణించొద్దని సీనియర్ మెకానిక్‌లు సూచిస్తున్నారు. - 8లో▸



అర్చకులకు వేతనాలు అందించాలి
దూపదీపనైవేద్య అర్చకులకు ప్రతీనెల వేతనాలు అందేలా చూడాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్‌ను గంగు ఉపేంద్రశర్మ కోరారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0°/23.0°

వాతావరణం
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ములుగు రూరల్: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ ఏటూరునాగారంలో 6,7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ హరిసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 15వ తేదీన దేహదారుఢ్య నైపుణ్య పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, కులము, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్, నాలుగు కలర్ ఫొటోలు తీసుకుని ఏటూరునాగారం క్రీడాపాఠశాలలో హాజరు కావాలని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులు అర్హులని వెల్లడించారు. 6వ తరగతిలో 24, ఏడో తరగతిలో 18, ఎనిమిదో తరగతిలో 6, తొమ్మిదవ తరగతిలో 10 మొత్తంగా 58 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

వేలం పాట ఆదాయం రూ.7.92లక్షలు

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయ ఆవరణలో 2025–26 సంవత్సరంలో లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు బుధవారం నిర్వహించిన సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలో రూ.7.92 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్ తెలిపారు. 2025 అక్టోబర్ 4 నుంచి ఏడాది పాటు రామప్పలో లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు వేలం పాటలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రాప్ మ్యాపింగ్‌తో రైతులకు మేలు



గీసుకొండ : క్రాప్ మ్యాపింగ్‌తో రైతులకు మేలు కలుగుతుందని రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లిలోని టీసీఐఆర్‌డీ శిక్షణ కేంద్రంలో ఎఫ్‌పీసీఎల్ ఐఎన్‌టీఎల్–04 ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రాప్ మ్యాపింగ్‌పై అవగాహన పెంచుకుంటే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. బీసీఐ ఇండియా నుంచి రాజీవ్, కరీంనగర్, ములుగు, నర్సంపేట ప్రాంతాల నుంచి అధికారులు శిక్షణ తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రజ్వల్ సీఈఓ రామ్మూర్తి, ప్రాజెక్టు మేనేజర్ ఇన్నారెడ్డి, టెక్నికల్ కోఆర్డినేటర్ ప్రమోద్, పీయూ మేనేజర్ అయేశ్, మానస, నాగరాజు, శ్రవణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకోవాలి



కాళేశ్వరం: ప్రతీఒక్కరు రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను వినియోగించుకోవాలని టీం లీడర్ అనిల్ అన్నారు. బుధవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని సీహెచ్‌సీని ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్, డాక్టర్ నిఖిల్ స్వరూప్, మేనేజర్ విక్రమ్ ఆదేశాల మేరకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డయాలసిస్ సెంటర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ విద్యావతితో కలిసి చూశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు రికార్డులను పరిశీలించారు. చికిత్స అందించడంలో సమస్యలు ఉంటే తెలపాలని రోగులను కోరారు. ఆయన వెంట ఆరోగ్యమిత్రలు సంతోష్, రాము తదితరులు ఉన్నారు.

మరింత సహకారం

రైతు ఉత్పత్తి సంఘాలుగా పీఏసీఎస్‌లు

- జిల్లాలో 8 సొసైటీల ఎంపిక
- ప్రభుత్వ నిధులతో వ్యాపారం
- రైతుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

ములుగు రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలు అందించడం, వసూలు చేయడానికి పరిమితమైన పీఏసీఎస్‌లు రూపు మార్చుకోనున్నాయి. విడతల వారీగా సంఘాలను ఆధునికీకరించడంతో పాటు రైతులకు ఆదాయం పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రైతు ఉత్పత్తి సంఘాలను(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) మార్పు చేసింది. ఈ మేరకు జిల్లాలో 8 సంఘాలను ఎంపిక చేసింది.

10 మండలాలు.. 12 సంఘాలు

జిల్లాలోని 10 మండలాల పరిధిలో 12 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో రైతు ఉత్పత్తి కేంద్రాలుగా 8 సంఘాలు ఎంపికయ్యాయి. ఈ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులే సంఘాలుగా ఏర్పడి తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకునే విధంగా వెసులుబాటు కల్పించనుంది. దీంతో పాటు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సలహాలు ఇవ్వనుంది. డ్రోన్, రోబోటిక్స్ వంటి యంత్రాల వినియోగంపై సాంకేతిక పరిజ్ఞానం అందజేస్తోంది. మార్కెటింగ్, ధాన్యం నిల్వలు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ, పాల ఉత్పత్తి సంఘాల ఏర్పాటు, శీతల గిడ్డంగుల నిర్మాణం, ఔషధి కేంద్రాల ఏర్పాటు, ఆధునిక వ్యవసాయ పరికరాల విక్రయం, మత్స్యకేంద్రాల నిర్వహణ వంటి వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తారు.

ప్రభుత్వం ఎంపికైన సంఘాలివే..
ములుగు
వెంకటాపురం(ఎం)
గోవిందరావుపేట
ఎస్ఎస్ తాడ్వాయి
ఏటూరునాగారం
మంగపేట
వాజేడు
వెంకటాపురం(కె)





రైతు ఉత్పత్తి కేంద్రంగా ఎంపికైన ములుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

నిర్వహణ ఖర్చులు మంజూరు

రైతు ఉత్పత్తి కేంద్రాలుగా ఎంపికైన పీఏసీఎస్‌లకు ఏడాదికి రూ.6 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.18లక్షలు నిర్వహణ ఖర్చుల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. దీంతో పాటు అదనంగా రూ.15 లక్షలు ఈక్విటీ గ్రాంట్ విడుదల చేస్తుంది. ఒక్కో ఎఫ్‌పీఓకు క్రెడిట్ గ్యారంటీ కింద రూ. 2 కోట్ల వరకు గ్యారంటీ సదుపాయం లభిస్తుంది.

వ్యాపారం చేసుకునేందుకు వెసులుబాటు

జిల్లాలో మొత్తం 12 సంఘాలు ఉండగా అందులో 8 సంఘాలు రైతు ఉత్పత్తి కేంద్రాలుగా ఎంపికయ్యాయి. సంఘాల అభివృద్ధితో పాటు సొసైటీల పరిధిలో ఉన్న రైతులు ఐకమత్యంతో వ్యాపారం చేసుకోవడానికి వీలుకలుగుతుంది. సంఘాల పరిధిలోని రైతులకు ఆధునాతన వ్యసాయం, యాంత్రీకరణపై అవగాహన కల్పిస్తారు.



- సర్దార్‌సింగ్, జిల్లా సహకార అధికారి

ఓటరు తుది జాబితా ప్రదర్శన

జిల్లాలో 10 జెడ్పీటీసీలు, 83 ఎంపీటీసీలు
- 171 గ్రామపంచాయతీలు 473 పోలింగ్ కేంద్రాలు
- జిల్లాలో 2,29,159 మంది ఓటర్లు



తుది జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

ములుగు: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ సభ్యులు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ సభ్యుల (జెడ్పీటీసీ) తుది ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాను జెడ్పీ సీఈఓ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.సంపత్‌రావు బుధవారం విడుదల చేశారు. ఈ నెల 8లోపు అభ్యంతరాలు స్వీకరించి, 9న అభ్యంతరాలు పరిష్కరించి, బుధవారం పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాలోని 10 మండలాల పరిధిలో 171 గ్రామ పంచాయతీలు ఉండగా 10 జెడ్పీటీసీ స్థానాలు, 83 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 473 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వీటి పరిధిలో మొత్తం 2,29,159 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,10,838 మంది పురుషులు, 1,18,299 మంది మహిళలు, 22 మంది ఇతరులు ఉన్నారు.

జిల్లాలో మండలాల వారీగా ఎంపీటీసీల జాబితా

మండలం	గ్రామ పంచాయతీలు	ఎంపీటీసీలు	ఓటర్లు
వెంకటాపురం(ఎం)	23	9	28,236
ఏటూరునాగారం	12	9	24,636
గోవిందరావుపేట	18	9	25,441
కన్నాయిగూడెం	11	5	9,992
మల్లంపల్లి	10	5	13,507
మంగపేట	25	14	39,369
ములుగు	19	9	24,985
ఎస్ఎస్ తాడ్వాయి	18	7	18,226
వెంకటాపురం(కె)	18	9	25,336
వాజేడు	17	7	19,431

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్

వెంకటాపురం(కె): ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏటూరునాగారం డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతికుమార్ అన్నారు. మండల పరిధిలో బుధవారం ఆయన పర్యటించి పామునూరు వీరభద్రవరం సబ్‌సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని కమ్మరిగూడెం, సూడిబాక గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సందర్శించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అజ్మీరా జ్యోతి, పవన్ కల్యాణ్, అశీష్, కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు రాఘవులు, రాజేష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సొంతింటి కల సాకారం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



మదనపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ –శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల పరిధిలోని మదనపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి మంత్రి బుధవారం హాజరై మాట్లాడారు. జిల్లాలో 5వేల ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గిరిజనభవన్‌లో నిర్వహించిన కృతజ్ఞత సన్మానసభకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ ఉపకులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల్లో నియోజకవర్గంలో 100ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎస్సీ ఉపకులాలకు కమ్యూనిటీ భవన నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిందని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్కను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, గడ్డం వెంకటేశ్వర్లు, కుమారస్వామి, రమేష్, గోపాల్ వెంకటరాంనర్సయ్య, రాజమౌళి, రమేష్ పాల్గొన్నారు.

రూ.4లక్షల డిపాజిట్ పత్రాలు అందజేత

ములుగు మున్సిపాలిటీ పరిధిలో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించి బాధితుడి పిల్లల పేరున రూ.4లక్షల డిపాజిట్ చేసిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేష్ మృతికి కారణమైన ఉద్యోగులను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు వారి స్వార్థ రాజకీయాల కోసం మహేష్ మరణాన్ని వాడుకుంటున్నారని వివరించారు. అనంతరం మదనపల్లి గ్రామానికి చెందిన దూడ పాక మహేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

జిల్లా విద్యాధికారి సిద్ధార్థరెడ్డి



మొదటి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

ములుగు/ములుగు రూరల్/ఏటూరునాగారం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే కళాఉత్సవ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లా విద్యాధికారి సిద్ధార్థరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు జరగగా డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించగా అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రస్థాయి కళా ఉత్సవాలకు ఎంపికచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, కోఆర్డినేటర్ సాంబయ్య, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య, సముద్రాల శ్రీనివాస చారి, హమీద్, బాలాజీ రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఈ కళాఉత్సవ్ పోటీల్లో బండారుపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి దీక్షరామ్ క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని డీఈఓ సిద్ధార్థరెడ్డి, పాఠశాల హెచ్ఎం దేవకి, సిబ్బంది అభినందనలు తెలిపారు. అదే విధంగా ఏటూరునాగారం మండల పరిధిలోని రామన్నగూడెంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారని ఎంఈఓ మల్లయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రూప్ డ్యాన్స్ , ఫోక్‌లో హర్షవర్ధన్, ఉమా మహేష్, రిషీక్, సాయినాథ్, కార్తీక్, వరుణ్, సందేశ్‌ల బృందానికి ప్రథమ బహుమతి వచ్చిందని తెలిపారు. ఈ మేరకు వారు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ 2025కు ఎంపికైనట్లు ఆయన వివరించారు.

మద్యం టెండర్లకు కసరత్తు

ఉమ్మడి వరంగల్‌లో 294 దుకాణాలు
- దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలకు పెంపు
- త్వరలో టెండర్ల తేదీల ప్రకటన
- డీసీ కార్యాలయాలకు అందిన మార్గదర్శకాలు



ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా మద్యం దుకాణాలు

జిల్లా	వైన్స్‌లు
హనుమకొండ	65
వరంగల్	63
జనగామ	47
మహబూబాబాద్	59
జేఎస్ భూపాలపల్లి ములుగు	60
	294

సాక్షిప్రతినిధి, వరంగల్: వైన్స్ (ఏ4)లకు 2025–27 సంవత్సరాలకు సంబంధించి టెండర్లు నిర్వహించేందుకు ఆబ్కారీ శాఖ సన్నద్ధమవుతోంది. వాస్తవానికి నవంబర్ నెలాఖరుతో గడువు ముగియనుండగా.. ఒక నెల ముందుగానే టెండర్లు నిర్వహించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిసింది. గత ప్రభుత్వం 2023 ఆగస్టులోనే వైన్స్‌ల టెండర్లు నిర్వహించిన విషయం తెలిసిందే. డిసెంబర్ 1 నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ అమల్లోకి వస్తున్నప్పటికీ అక్టోబర్‌లో టెండర్లు నిర్వహించాలని ఆబ్కారీ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్లతో ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. దీంతో అక్టోబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ వెలువడవచ్చని అధికారులు భావిస్తున్నారు.

డిసెంబర్ 1 నుంచే కొత్త దుకాణాలు

ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్ల సందర్భంగా 2023–25 ఎక్సైజ్ పాలసీనే అమలు చేయనున్నట్లు చెబుతున్నారు. ఈసారి కూడా ఆరు స్లాబుల విధానాన్నే అమలు చేయనున్నట్లు తెలిసింది. గతంలో 5 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాలకు రూ.50 లక్షల లైసెన్స్ ఫీజు వసూలు చేశారు. 5 వేల నుంచి 50 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభాకు రూ.60 లక్షలు, లక్ష జనాభా నుంచి 5 లక్షల్లోపు ఉన్న ప్రాంతాలకు రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల్లోపు జనాభా ప్రాంతాలకు రూ.85 లక్షలు, 20 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.1.10 కోట్లు లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. ఈసారి కూడా అదే పాలసీ అమలు చేయనుండడంతో ఎప్పటిలాగే టెండర్లు వేసేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. కాగా, డిసెంబర్ ఒకటి నుంచి రాబోయే రెండేళ్లకు సంబంధించి కొత్త పాలసీ అమలుల్లోకి రానుండగా.. గతంలో మాదిరిగానే దుకాణాలకు సంబంధించి మూడు సామాజికవర్గాల (గౌడ, ఎస్సీ, ఎస్టీ) వ్యాపారులకు 30 శాతం వరకు రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ఈసారి మద్యం దుకాణాల టెండర్లు పోటాపోటీగా సాగనున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మేడారం సమ్మక్క–సారలమ్మ–జాతరతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగనున్నాయన్న చర్చ ఇప్పటికే సాగుతోంది.

రిజర్వేషన్లు యథాతథం.. దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు

మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు యథాతథంగా అమలు కానున్నట్లు, ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా.. టెండర్లు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈమేరకు మద్యం దుకాణాల్లో గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం కేటాయించేలా జిల్లాల వారీగా మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరినట్లు సమాచారం. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జేఎస్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో 2021–23 సంవత్సరాల నుంచి ఈ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. ఈసారి కూడా ఉమ్మడి వరంగల్‌లో 294 మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు పాటించనున్నారు. ఈలెక్కన ఉమ్మడి వరంగల్‌లో 15 శాతం రిజర్వేషన్ల కింద గౌడ సామాజికవర్గానికి 39 నుంచి 44 దుకాణాలు రానున్నాయంటున్నారు. ఎస్సీలకు 27 లేదా 29, ఎస్టీలకు 13 నుంచి 15 దుకాణాలు కేటాయించనున్నారు. సుమారు 206 నుంచి 215 మద్యం దుకాణాలకు ఓపెన్ కేటగిరీ కింద కేటాయించే అవకాశం ఉండగా.. ఇందులోనూ అన్ని సామాజికవర్గాలు పాల్గొనే వీలుంటుంది. కాగా, ఈసారి కూడా 2011 జనాభా ప్రకారమే షాపులు కేటాయించనుండగా, స్లాబ్‌ల విధానం కూడా గత పాలసీ ప్రకారమే కొనసాగించనున్నారు. అయితే గతంలో టెండర్ దరఖాస్తు ధర రూ.2 లక్షలు ఉండగా.. ఈ సారి రూ.3 లక్షలకు పెంచారు.

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా సంక్షేమాధికారి తుల రవి

ములుగు రూరల్: వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా సంక్షేమాధికారి తుల రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పట్టించుకోని పక్షంలో సీనియర్ సిటిజన్ యాక్టు ద్వారా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఇలాంటి సమస్యను ఎదుర్కొనే వారు కలెక్టర్ లేదా ఆర్డీఓను సంప్రదించాలని సూచించారు. సీనియర్ సిటిజన్‌లు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కార మార్గం చూపుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో బాసాని రాంమూర్తి, అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, దామోదర్, యుగేందర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బాసాని రాంమూర్తి, కో కన్వీనర్లుగా వెంకట్‌రెడ్డి, చందర్‌రావు, సంజీవరావులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రవి

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని బీసీ వెల్ఫేర్ అధికారి తులరవి అన్నారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ అధికారి తుల రవి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ మహిళా శక్తికిప్రతీకగా నిలిచారన్నారు. భూస్వాముల దౌర్జన్యాలకు తలొగ్గకుండా రైతుల పక్షన నిలబడి పోరాడిన వీరవనిత అని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు రమేష్, చాపర్తి రాజు, మహేందర్, పరికరాల రవి, గూడెల్లి ఓదెలు, నేరెళ్ల శంకర్, జాలిగం శ్రీనివాస్, భద్రయ్య, సారంగపాణి, బీసీ వెల్ఫేర్‌శాఖ అధికారులు సరిత, మానస, కుమారస్వామి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రవి తదితరులు

ఏజెన్సీ విద్యపై దృష్టి సారించాలని వినతి

వెంకటాపురం(కె): ఏజెన్సీ మండలాల్లో విద్యా వ్యవస్థపై అధికారులు దృష్టి సారించాలని కోరుతూ బుధవారం ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్స నర్సింహమూర్తి మాట్లాడుతూ వెంకటాపురం, వాజేడు మండలాల్లో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతుందన్నారు. విద్యార్థులు వందల సంఖ్యలో ఉంటే ఉపాధ్యాయులు మాత్రం ఒక్కరే ఉంటున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 11 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా 30 శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలే ఉన్నాయని తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు కేవలం కేర్ టేకింగ్ స్కూల్స్‌గానే నడుస్తున్నాయని తెలిపారు. విద్యాబోధన సరిగా ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, మహేష్, నారాయణ, నర్సింహరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

ధూపదీపనైవేద్య అర్చకులకు వేతనాలు అందించాలి



కమిషనర్‌తో రాష్ట్ర అర్చక ఉద్యోగ జాక్‌ సభ్యులు, అర్చకులు

హన్మకొండ కల్చరల్‌ : గ్రామాల్లోని ధూపదీప నైవేద్య అర్చకులకు సక్రమంగా ప్రతీనెలా వేతనాలు అందేలా ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగజాక్‌ చైర్మన్‌ గంగు ఉపేంద్రశర్మ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర చేనేత భవన్‌లో నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన దేవాదాయధర్మాదాయశాఖ కమిషనర్‌, దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ శైలజరామయ్యర్‌ను గంగు ఉపేంద్రశర్మ, పరాశరం రవీంద్రాచారి, దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచారి, ఇతర అర్చకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్చక ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనేక దేవాలయాల్లో క్యాడర్‌ స్ట్రెంత్‌లేక ఇబ్బంది పడుతున్నారని, ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని వివరించారు. ప్రమోషన్ల విషయంలో సంబంధిత అధికారులతో జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకుంటానని కమిషనర్‌ పేర్కొన్నారు.

11,12 తేదీల్లో ఇంటర్‌ కాలేజీ కబడ్డీ టోర్నమెంట్‌

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాల డిగ్రీ, పీజీ కాలేజీలకు ఇంటర్‌ కాలేజీ కబడ్డీ టోర్నమెంట్‌ ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ టి. మనోహర్‌ తెలిపారు. ఆలిండియా ఇంటర్‌ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌, సౌత్‌జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు సెలక్షన్స్‌ కూడా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కేయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీల నుంచి కబడ్డీ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కేయూ రిజిస్ట్రార్‌ వి రామచంద్రం, స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య పాల్గొంటారని చెప్పారు.

ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలి



ఎన్పీడీసీఎల్‌ సీఎండీ పేషీలో అధికారికి వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

హన్మకొండ: విద్యుత్‌ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్‌ జేఏసీ నాయకులు కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌ గెస్ట్‌హౌస్‌లో జేఏసీ ఎన్పీడీసీఎల్‌ శాఖ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 9వ తేదీ వరకు ఉద్యోగులకు జీతాలు అందకపోవడంపై చర్చించారు. అనంతరం టీజీ ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలో ఫైనాన్స్‌ డైరెక్టర్‌ వి.తిరుపతి రెడ్డి, సీఎండీ పేషీలో అధికారికి వినతి పత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీతాలు ఆలస్యమైతే వైద్య ఖర్చులు, అప్పుల వాయిదాలు, కుటుంబ అవసరాలకు అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎ.విజేందర్‌ రెడ్డి, కేవీ.జాన్సన్‌, ఎస్‌.మల్లికార్జున్‌, బండారి ప్రభాకర్‌, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బైక్‌.. భద్రం!



వరద నీటిలో పార్క్‌ చేసిన వాహనాలు(ఫైల్‌)

వర్షాకాలంలో ద్విచక్రవాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలి
- ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మెకానిక్‌ షెడ్‌కు వెళ్లాల్సిందే
- మరమ్మతుకు చేతిలో వేలాది రూపాయలు ఉండాల్సిందే..
- వర్షపు నీటిలో ప్రయాణించొద్దని మెకానిక్‌ల సూచన



వర్షంలో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారుడు (ఫైల్‌)

ఖిలా వరంగల్‌: వర్షాకాలంలో ద్విచక్రవాహనాలను భద్రంగా చూసుకోవాలి. వర్షం కురుస్తున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణించొద్దు. అప్పుడే బైక్‌లు కొద్దికాలంపాటు మన్నికగా ఉంటాయి. ఇలా కాకుండా నిర్లక్ష్యంగా నడిపితే వాహనాలు మరమ్మతులకు గురవుతాయి. అప్పుడు కనీసం రూ.2వేలు చేతిలో ఉండాల్సిందే. ఇంజన్‌ పాడైతే రూ.6వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన అదనపు భారం పడే అవకాశముంది. ఒక్కసారిగా ఇంత ఖర్చు చేయాలంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు భారమే. కనీస జాగ్రత్తలు పాటిస్తే వాహనాలు మన్నికగా ఉంటాయని సీనియర్‌ మెకానిక్‌ అంకాల సతీశ్‌ చెబుతున్నారు.

బైక్‌ల నిర్వహణ గాలికి..

వరంగల్‌ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల పైగా ద్విచక్రవాహనాలు ఉన్నాయి. ఏటా సుమారు రూ.20వేలకు పైగా కొత్త వాహనాలు రహదారులపైకి వస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన చాలా మంది వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా మరమ్మతులకు గురవడంతో వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.

నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడే పార్క్‌..

వర్షం కురుస్తున్న సమయంలో పలువురు తమ వాహనాలను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ ఆపుతారు. దీంతోపాటు వాహనాన్ని రహదారులపై మెకాలి లోతులో నిలిచిన నీటి నుంచి నడుపుకుంటూ వెళ్తారు. ఇలా చేయడం వల్ల పలు భాగాల్లోకి నీరు చేరి బైక్‌ మొరాయిస్తుంది. లాక్‌ సిస్టమ్‌, ప్లగ్‌, కేబుళ్లు, బ్రేకులు, ఇంజన్‌, ఫైరింగ్‌ సిస్టమ్‌.. ఇలా వాహనంలో ప్రతీ వస్తువు పాడయ్యే అవకాశముంది.

వాహనం నీటిలో నానితే బ్రేక్‌ సిస్టమ్‌పై ప్రభావం..

వాహనం నీటిలో నానితే బ్రేక్‌ సిస్టమ్‌పై ప్రభావం చూపుతుంది. మరో వైపు ప్రతీ వాహనదారుడు తమ వాహనానికి సంబంధించి టైర్లు, బ్రేకులు బాగున్నాయా..? లేవా..? అని తనిఖీ చేయాలి. దీంతోపాటే చైన్‌ను కూడా లూబ్రికేషన్‌ చేయించాలి. తడిస్తే తుప్పు పడుతుంది. ఈనేపథ్యంలో చైన్‌ లూబ్రికేంట్‌ను వాడడం మంచిది. వర్షాకాలంలో తడి, నీళ్ల రోడ్లపై చాలా మంది ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో మొదట వాహన టైర్లును తనిఖీ చేయాలి. అరిగిపోయి ఉంటే వాటిని మార్చుకోవాలి. బ్యాటరీ పూర్తిగా చార్జింగ్‌ చేసి మంచి స్థితిలోఉందో.. లేదో చూసుకోవాలి. వర్షానికి వాహనం తడిస్తే ఆ ప్రభావం పలు భాగాలపై పడుతుంది. విజిబిలిటీ బాగుండాలంటే బ్యాటరీ ఫుల్‌గా ఉండాలి. బల్బు పోతే వెంటనే మార్చుకోవాలి.

బైక్‌ను భద్రంగా కాపాడుకోవాలి..

వర్షం కురుస్తున్న సమయంలో బైక్‌పై ప్రయాణం ప్రమాదకరం. బ్రేక్‌లు, క్లచ్‌లు పనిచేయక బైక్‌ అదుపు తప్పి ప్రమాదం జరుగుతుంది. లోతట్టు ప్రాంతాల్లో ప్రయాణిస్తే సైలెన్సర్‌ ద్వారా ఇంజిన్‌లోకి వరదనీరు చేరి బైక్‌ పాడవుతుంది. తద్వారా మరమ్మతుకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇలా కాకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ వర్షాకాంలో బైక్‌ను భద్రంగా కాపాడుకోవాలి.

అంకాల సతీశ్‌,
సీనియర్‌ బైక్‌ మెకానిక్‌

వర్షాకాలంలో సూచనలు..

నీటిలో వాహనం నడపొద్దు.. వర్షాకాలంలో రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచి ఉంటుంది. ఈమార్గాల్లో వెళ్లకపోవడం శ్రేయస్కరం. మరో వైపు నీటిలో గుంతలు కనిపించకపోవడంతో అందులో పడిపోయే ప్రమాదం ముంది. దీంతోపాటు వాహనం ఎగ్జాస్టర్‌లోకి నీరు చేరే ఆస్కారముంది. ఫలితంగా వాహనం ఆగిపోతుంది. ఇంజన్‌ పాడవుతుంది. వాహనంలో ముఖ్యమైన భాగం ఇంజన్‌. ఇంజన్‌ ఫెయిలైతే వేలాది రూపాయలు ఖర్చు చేయాలి. అందుకే వర్షాకాలంలో సైలెన్సర్‌లోకి నీరు వెళ్లకుండా చూసుకోవాలి.

వాహనంపై కవర్‌ కప్పాలి..

వర్షానికి వాహనం తడుస్తున్నా చాలా మంది ద్విచక్ర వాహనదారులు పెద్దగా పట్టించుకోరు. బయట తిరిగి ఇంటికి వచ్చిన అనంతరం వర్షంలోనే వాహనం నిలుపుతారు. ఇలా ఎప్పుడూ చేయొద్దు. తప్పని సరిగా వాహనంపై కవర్‌ కప్పాలి. వర్షం పడని ప్రాంతంలో పార్క్‌ చేస్తే భద్రంగా ఉంటుంది.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌

తొర్రూరు: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ ఆరోపించారు. మహబూబాబాద్‌ జిల్లా తొర్రూరులోని విశ్రాంతి భవనంలో బుధవారం బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణతో కలిసి శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడారు. రాష్ట్రపతి భవన్‌, రాజ్‌భవన్‌ను కేంద్రం జేబు సంస్థలుగా మార్చుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి మండల్‌ నుంచి నేటి బీసీ బిల్లు వరకు బీజేపీ బీసీలను మోసగిస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్‌ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టిందని, కేంద్రం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టి అమలు చేస్తుందా లేదా చెప్పడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరడం హాస్యాస్పదమన్నారు. రిజర్వేషన్ల అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై త్వరలో సింహగర్జన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేయూ ప్రొఫెసర్‌ మల్లేశ్వర్‌, నాయకులు గుండగాని వేణు, గట్టు ప్రభాకర్‌, పెదగాని సోమయ్య, మురళి యాదవ్‌, భిక్షంగౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ చరిత్ర భావితరాలకు తెలియజేయాలి

- ఓబీసీ చైర్మన్‌ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌ యాదవ్‌



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంగంరెడ్డి సుందర్‌రాజ్‌ యాదవ్‌, మహిళలు

హన్మకొండ: చాకలి ఐలమ్మ చరిత్ర భావితరాలకు తెలియజేయాలని ఓబీసీ చైర్మన్‌ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌ యాదవ్‌ అన్నారు. నక్కలగుట్టలోని హోటల్‌ హరిత కాకతీయలో చాకలి ఐలమ్మ వర్ధంతి, మహిళా చైతన్య సదస్సు ఓబీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్‌ టి.విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి సుందర్‌రాజ్‌ యాదవ్‌, అతిథులు, మహిళలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా మేధావులు, ఉద్యోగులు, అధ్యాపకులు, సామాజిక ఉద్యమకారులతో కలిసి ఓబీసీ ఏర్పాటు చేశామన్నారు. భూమి.. భుక్తి.. వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ పోరాటం చేసిందని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ కోసం త్యాగాలు చేసిన 1200 మందిలో 80 శాతం మంది బీసీలేనన్నారు. అయినా ప్రభుత్వ పాలసీల్లో బీసీల ఊసేలేదని లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ బిల్లు ప్రకారం పెరిగే సీట్లతో 153 స్థానాల్లో 51 మంది మహిళలు ఉండబోతున్నారన్నారు. 51 మందిలో 26 సీట్లు బీసీ మహిళలు సాధించేలా కొట్లాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో బీసీ విద్యార్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ జనరల్‌ సెక్రటరీ ప్రొఫెసర్‌ గడ్డం భాస్కర్‌, కార్పొరేటర్లు చీకటి శారద, బైరి లక్ష్మి, రావుల కోమల, విజయశ్రీ, మహిళా ప్రతినిధులు దాసోజు లలిత, డాక్టర్‌ నాగవాణి, డాక్టర్‌ రమ, అరుణ, లక్ష్మి, ఓబీసీ నాయకులు అరవింద్‌స్వామి, ఎంఎస్‌ మూర్తి, వేణుమాధవ్‌, సరిత, మౌనిక, భవాని, సరస్వతి, పద్మజ, ప్రవల్లిక, శ్రావణి, షైన్‌, పల్లవి, శ్రీలత, విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.

సంపులో పడి ఆర్టిజన్‌ కార్మికుడి మృతి

- కేటీపీపీలో ఘటన



సురేశ్‌(ఫైల్‌)

గణపురం: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు కాకతీయ థర్మల్‌ విద్యుత్‌ కేంద్రంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ ఆర్టిజన్‌ కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామానికి చెందిన తూండ్ల సురేశ్‌(38) కేటీపీపీ మొదటి దశ 500 మెగావాట్ల విద్యుత్‌ కేంద్రంలో 2017 నుంచి ఆర్టిజన్‌ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం యథావిధిగా విధులకు హాజరైన సురేశ్‌.. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి బాటమ్‌ యాష్‌ సంపులో పడి మృతి చెందాడు. బుధవారం విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న కేటీపీపీ సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కాగా, మృతుడికి భార్య జీవిత, కూతురు సిరివల్లి, కుమారుడు సుజిత్‌ ఉన్నారు. సురేశ్‌ మృతితో కేటీపీపీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డెంగీతో చిన్నారి ..



సంహిత (ఫైల్‌)

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వనపర్తి గ్రామానికి చెందిన కొడె ఉపేందర్‌, అనిత దంపతుల కూతురు సంహిత (07) బుధవారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉపేందర్‌, అనిత దంపతులు జనగామలో ప్రైవేట్‌ ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల గ్రామంలో బోనాలు, ఇతర పండుగలు రావడంతో అనిత స్వగ్రామం కోడూరుకు, అత్తగారిల్లు వనపర్తికి వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో సంహితకు పదిహేను రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో ప్రైవేట్‌ ఆస్పత్రులకు, అనంతరం చంపక్‌హిల్స్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు తరలించగా డెంగీ అని నిర్ధారణ అయ్యింది. దీంతో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చిన్నారి సంహిత మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషయంపై స్థానిక వైద్యురాలు స్వర్ణలతను వివరణ కోరగా ఆ కుటుంబం జనగామలో నివాసం ఉంటోందని తెలిపారు.

మాడవీధుల నిర్మాణ పనుల పరిశీలన



మాడవీధుల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్‌ స్నేహశబరీష్‌, 'కుడా' అధికారులు

హన్మకొండ కల్చరల్‌: భద్రకాళి దేవాలయాన్ని బుధవారం సాయంత్రం హనుమకొండ కలెక్టర్‌ స్నేహ శబరీష్‌ సందర్శించారు. అమ్మవారిని దర్శించి పూజలు చేసిన అనంతరం అర్చకులు శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం మాడవీధుల పురోగతిని 'కుడా' అధికారులతో చర్చించి పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్‌ ఆదేశించారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల నుంచి మాడవీధి గుండా ప్రవేశం మార్గం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించి నవరాత్రులకు రెండు రోజుల ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయం ముందు ఉన్న, పార్కింగ్‌ స్థలాలను పరిశీలించారు. అనంతరం బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వేయిస్తంభాల దేవాలయాన్ని ఆమె సందర్శించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఆలయ ఈఓ, అసిస్టెంట్‌ కమిషనర్‌ రామల సునీత, ఆలయ చైర్మన్‌ డాక్టర్‌ బండారు శివసుబ్రహ్మణ్యం, ఆలయ అర్చకులు భద్రకాళి శేషు, 'కుడా' అధికారులు అజిత్‌రెడ్డి, భీంరావు, ఆర్డీఓ రమేశ్‌, వరంగల్‌ ఏసీపీ సత్యనారాయణ, మట్వాడ సీఐ కరుణాకర్‌, తహసీల్దార్‌ రవీందర్‌ ఉన్నారు.

ఉపాధి శిక్షణతో ఆర్థికాభివృద్ధి

- హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌ పాండే



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమాదేశ్‌ పాండే

హన్మకొండ: మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ఉపాధి శిక్షణ దోహదపడుతుందని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో మహిళా సాధికారత మేళా కార్యక్రమం జరిగింది. మగ్గం శిక్షణ, టైలరింగ్‌, బ్యూటిషన్‌ ట్రెనింగ్‌ పొందిన 350 మంది మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి శిక్షణతో కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్నారు. అడిషనల్‌ డీసీపీ రవి, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్‌ సిస్టర్‌ సహాయ, సంస్థ రీజినల్‌ అధ్యక్షులు రుమాల్డిన, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్‌, బత్తుల కరుణ, ఆయా సంస్థల ప్రతినిధులు అనితారెడ్డి, కె.నాగవాణి, ఆల్బటా అమృత, ఎం,అజయ్‌కుమార్‌, ఈసంపల్లి సుదర్శన్‌, పరికి సుధాకర్‌, సుదర్శన్‌ గౌడ్‌, ప్రభాకర్‌, శివప్రసాద్‌, కొమ్ముల నవీన్‌ పాల్గొన్నారు.

దానాపూర్‌ రైలుకు చర్లపల్లిలో హాల్టింగ్‌

- పండుగల రద్దీ దృష్ట్యా 10 రోజులపాటు అమలు..



కాజీపేట రూరల్‌ : ప్రయాణికుల సౌకర్యార్థం దీపావళి, దసరా, ఛాత్‌పూజా పండుగల సందర్భంగా కాజీపేట జంక్షన్‌ మీదుగా వెళ్లే సికింద్రాబాద్‌–దానాపూర్‌ డైలీ ఎక్స్‌ప్రెస్‌కు చర్లపల్లిలో తాత్కాలికంగా హాల్టింగ్‌ కల్పించినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. సెప్టెంబర్‌ 10వ తేదీ నుంచి 10 రోజులపాటు పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లిలో హాల్టింగ్‌ కల్పించినట్లు తెలిపారు.

హాల్టింగ్‌ వివరాలు..

సికింద్రాబాద్‌–దానాపూర్‌ (12791) ఎక్స్‌ప్రెస్‌ సికింద్రాబాద్‌లో 9: 25 గంటలకు బయలుదేరి చర్లపల్లికి 9:40 గంటలకు, కాజీపేటకు 11:08 గంటలకు చేరుతుంది. అదేవిధంగా దానాపూర్‌–సికింద్రాబాద్‌ (12792) ఎక్స్‌ప్రెస్‌ దానాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు కాజీపేటకు 18:23 గంటలకు, చర్లపల్లికి 20:42 గంటలకు, సికింద్రాబాద్‌కు 21:30 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు నాలుగు ప్యాసింజర్‌ రైళ్లు రద్దు..

కాజీపేట రూరల్‌ : కాజీపేట–విజయవాడ మార్గంలో నెక్కొండ–కేసముద్రం–మహబూబాబాద్‌ మధ్య చేపడుతున్న థర్డ్‌ లైన్‌ కమిషనింగ్‌ ఎన్‌ఐ వర్క్స్‌ కారణంగా గురువారం పలు ప్యాసింజర్‌ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్‌ బుధవారం తెలిపారు.

నేడు రద్దయ్యే రైళ్ల వివరాలు..

కాజీపేట–డోర్నకల్‌ (67765) ప్యాసింజర్‌, డోర్నకల్‌–కాజీపేట (67766) ప్యాసింజర్‌, డోర్నకల్‌–విజయవాడ (67767) ప్యాసింజర్‌, విజయవాడ–డోర్నకల్‌ (67768) ప్యాసింజర్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

పాక్షికంగా రద్దు..

భద్రాచలం రోడ్‌–బల్లార్షా (17033) సింగరేణి ప్యాసింజర్‌ను భద్రాచలంరోడ్‌–కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు సీపీఆర్వో తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నర్సంపేట రూరల్‌: కూలి విషయంలో దంపతుల మధ్య జరిగిన గొడవతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నర్సంపేట మండలం పర్శనాయక్‌తండాలో చోటుచేసుకుంది. ఎస్సై గూడ అరుణ్‌ ప్రకారం.. తండాకు చెందిన కొర్ర జగన్‌ (45), జ్యోతి దంపతులు కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జ్యోతి గ్రామంలో కొర్ర రవీందర్‌ వద్దకు మిషన్‌లో మొక్కజొన్నలు పట్టే కూలికి వెళ్తోంది. అయితే ఆ పనికి వెళ్లొద్దని జగన్‌ ఎంత చెప్పినా జ్యోతి వినకపోవడంతో పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో బుధవారం రవీందర్‌.. జగన్‌ ఇంటికొచ్చి జ్యోతిని కూలికి రావాలని కోరాడు. దీనిపై దంపతులు మళ్లీ గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన జగన్‌ గుర్రై ఇంట్లోకెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై గూడ అరుణ్‌ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటకు తరలించారు. జగన్‌ తల్లి సమ్మక్క ఫిర్యాదు మేరకు రవీందర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొడుకు చంపుతాడనే భయంతో..

- కుమారుడిని హత్య చేసిన తండ్రి
- ఈ ఘటనలో తండ్రితోపాటు సహకరించిన ముగ్గురి అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన పోలీసులు



నిందితుల అరెస్ట్‌ చూపుతున్న సీఐ సురేశ్‌, ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): మద్యానికి బానిసై, ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లతో అప్పుల పాలైన కుమారుడు తనను ఎక్కడ చంపుతాడనే భయంతో తండ్రే తన కుమారుడిని హత్య చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు మంగళవారం ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ములుగు సీఐ దారం సురేశ్‌, వెంకటాపురం ఎస్సై చల్ల రాజు వివరాలు వెల్లడించారు. వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన రిటైర్డ్‌ టీచర్‌ దుర్గం సూరయ్యకు ఇద్దరు కుమారులు సంపత్‌, అశోక్‌ (32) ఉన్నారు. సూరయ్య ప్రస్తుతం ములుగు మండలం రంగారావుపల్లి శివారులో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో సూరయ్య చిన్న కుమారుడు అశోక్‌ మద్యానికి బానిసై ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లో తీవ్రంగా నష్టపోయి తన వాటాగా వచ్చిన రెండు ఎకరాల భూమిని అమ్ముకున్నాడు. ఈనెల 7న లక్ష్మీదేవిపేట నుంచి రంగారావుపల్లిలో నివాసముంటున్న తండ్రి సూరయ్య వద్దకు వెళ్లి మద్యం మత్తులో ఎలాగైనా నిన్ను ఈరోజు చంపుతానంటూ బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన సూరయ్య తన పెద్దకుమారుడు సంపత్‌, తమ్ముడు సాంబయ్య సాయంతో అశోక్‌ మెడకు తాడు చుట్టి చంపేశాడు. అనంతరం డ్రైవర్‌ రమేశ్‌ సాయంతో అశోక్‌ మృతదేహాన్ని కారులో రంగారావుపల్లి నుంచి తీసుకుని తాను ఉంటున్న ఇంటి వద్ద పడేశాడు. ఈ ఘటనపై లక్ష్మీదేవిపేటకు చెందిన ఓ వ్యక్తి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

సంగెంలో యువకుడు..



నాగరాజు (ఫైల్‌)

సంగెం: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం ఎల్గూరు, చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండల కేంద్రానికి చెందిన భూపతి నాగరాజు(26) పదేళ్ల నుంచి పక్షవాతం, తల, నడుము నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అతడి బంధువులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆస్తి కోసం తల్లిని హత్య చేసిన కుమార్తె

- పాలకుర్తి మండలం పెద్దతండా (కే)లో దారుణం



లక్ష్మి (ఫైల్‌)

పాలకుర్తి టౌన్‌: ఆస్తి కోసం భర్తతో కలిసి కుమార్తె.. తల్లిని హత్య చేసింది. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం పెద్దతండా (కే) గ్రామంలో జరిగింది. సీఐ జానకీరాంరెడ్డి కథనం ప్రకారం.. పెద్దతండా(కే)కు చెందిన బాదావత్‌ లక్ష్మి (42) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త తిరుపతి 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఈ దంపతులకు సంగీత ఏకైక సంతానం. ఈమెకు ఐదేళ్ల క్రితం ఇదే మండలంలోని దుబ్బతండా(ఎస్‌పీ) గ్రామానికి చెందిన బానోత్‌ వీరన్నతో వివాహం చేశారు. తల్లి పేరిట ఉన్న 20 గుంటల వ్యవసాయ భూమి తన పేరుతో పట్టా చేయాలని సంగీత పలుమార్లు అడిగింది. ఇందుకు తల్లి నిరాకరించింది. దీంతో ఎలాగైనా ఆ భూమిని దక్కించుకునేందుకు తల్లిని హత్య చేయాలని ప్లాన్‌ వేసింది. ఈ విషయాన్ని భర్తతో చర్చించింది. ఇరువురు హత్య చేయాలని నిర్ణయం తీసుకొని మంగళవారం రాత్రి పెద్దతండాకు చేరుకున్నారు. కూతురు సంగీత, అల్లుడు వీరన్న కలిసి నిద్రలో ఉన్న లక్ష్మి ముఖంపై దిండుపెట్టి హత్య చేశారు. కూలి పని కోసం పిలవడానికి వెళ్లిన స్థానిక మహిళ చూసి తండావాసులకు బుధవారం తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి నేనావత్‌ చంద్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జానకీరాంరెడ్డి తెలిపారు.

డే కేర్‌ సెంటర్‌లో ఉచిత న్యాయ సలహాలు



వృద్ధుల డే కేర్‌ సెంటర్‌లో న్యాయ సలహాలు ఇస్తున్న పారా లీగల్‌ వలంటీర్‌ ఉపేందర్‌

హన్మకొండ: హనుమకొండ జిల్లా పరిషత్‌ కార్యాలయ ఆవరణలోని వయోవృద్ధుల డే కేర్‌ సెంటర్‌లో సీనియర్‌ సిటిజన్స్‌ కోసం ప్రారంభించిన లీగల్‌ ఎయిడ్‌ క్లినిక్‌ సేవలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయ సలహాదారుగా పారాలీగల్‌ వలంటీర్‌ ఎం. ఉపేందర్‌ను నియమించింది. ప్రతీ బుధ, శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యాయ సలహాలు అందిస్తారని సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యదర్శి తేరాల యుగేందర్‌ తెలిపారు. వివరాలకు 8074979359 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు తాదూరి లక్ష్మీనారాయణ, గంగారపు యాదగిరి, సుమతి, డాక్టర్‌ ఉష, తదితరులు పాల్గొన్నారు.